# కాటుతిన్న మనిషి

పి.వి.రమణ



ఉదయం వచ్చిన ఆ ఉత్తరాన్ని పదే పదే చదివినా అందులో వున్నదేమిటో ఒక పట్టాన అర్థంగాలేదు నాకు వజ్రమని భ్రమించింది మసిబొగ్గుగా నిరూపణ అయితే ఎంత నిరాశ పేరుకుపోతుందో, ఈ లేఖలోని సారాంశం గూడా శివరాంమీద నేను పెంచుకొన్న ఉన్నతమైన భావాలన్నింటిని సమూలంగా పెరికివేసి తీరని ఆవేదనతో నా మనసును కప్పివేసింది. శివరాం నా క్లాస్ మేట్, అంతకుమించి ఆత్మీయుడు.

ఒకే కంచం, ఒకే మంచంగా అల్లుకుపోయాం వాడి వివాహమై అయిదు సంవత్సరాలకు పైనే అయింది ఆ పెండ్లికి నేనుగూడా వెళ్ళాను ఈడూ జోడూ సరిపోయిన ముచ్చటైన జంటని ఎంతగానో మురిసిపోయాన్నేను. అసలు కాలేజీలో అమ్మాయిల్ని చూస్తేనే అదో రకంగా కంపించిపోయే శివరాం, ఈ వ్యసనాలతో, వ్యాపకాలతో ఎంతగా ఎదిగిపోయాడు! లలితైనా అనాకారి గాదు. ఒక విధంగా చెప్పాలంటే ఆమె ముందు వీడు దిగదుడుపే మనసులో మరుగుతున్న అన్ని సందేహాలను అదిమి పట్టి ఆ ఉత్తరాన్ని మరోసారి పరిశీలించాను.

"ఒక అపరిచితురాలినుండి ఈ లేఖ ఏమిటాని మీరు ఆశ్చర్యపోవచ్చు. ఏం జేయను? ఒక అవసరం, అంతకు మించిన అపద నాచేత ఇట్లా వ్రాయిస్తున్నది. మావారికి మీరు ఆప్తమిత్రులని తరచూ వారు చెప్పేదాన్నిబట్టి తెల్సింది. అందుకే ఈ చనువు తీసికొంటున్నాను. ఈ సాహసం చేస్తున్నాను. వారు మొదట్లో నన్నూ, ఇంటినీ విడిచి క్షణంగూడా వుండేవారు కారు. నా దురదృష్టంకొద్దీ ఈ మధ్య వారి కలవదని దురభ్యాసమంటూ లేదు నన్ను గూడా మర్చిపోయేటంతగా ఆ ద వా ళ్ళ తో స్నేహా లేర్పడ్డాయి వారికి భార్యనే దానికి ఇంతకు మించిన నరక మేముంటుంది? ఏడ్చాను మొత్తుకొన్నాను. హెచ్చరించాను ఆరోజు కారోజు వారి పోకడ హద్దుమీరిపోతున్నది. కనీసం మీరైనా వచ్చి వారిని అదుపులో పెట్టగలరని, నా కాపురాన్ని నిలబెట్టగలరనే ఆశతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. తప్పక వస్తారుగదూ!

మీ సహాయాన్ని కోరే
లలితా శివరాం"

వెళ్దామంటే అఫీసు వ్యవహారాల్లో క్షణం వెసులుబాటు లేదు "కనీసం మీరైనా వచ్చి" అనే లలిత అర్థింపు నా మనసును జాలితో నింపివేస్తున్నది నా బాధ్యతలను గుర్తుచేస్తున్నది. నా నరాల్లో ఏదో ఆత్మీయత; ఏదో అనుబంధాల తాలూకు విచిత్ర సందడి; ఎమైనాసరె వెళ్ళాలి. తప్పక వెళ్ళాలి. శివరాంకి బుద్ధి చెప్పి సరైన దార్లో పెట్టాలి ఆ కాపురాన్ని మళ్ళీ నిత్య వసంతంగా రూపు దిద్దాలి. అయిదొందల మైళ్ళదూరం అయిదడుగులే నన్న భావం కల్గింది నా కప్పుడు వస్తున్నానంటూ ఓ టెలిగ్రాం పంపి ఆ రాత్రే రైలెక్కాను

నన్ను చూస్తూనే అనుకోని అపదేదో ఎదురైనట్లు, ఊహించని ఉప్పెన ముంచుకొచ్చినట్లూ బిక్కచచ్చిపోయిన ముఖం పెట్టాడు శివరాం వాడి కాళ్లల్లో, కళ్ళల్లో కంగారు స్పష్టంగా కన్పిస్తున్నది. గొంతు పెగుల్చుకొని 'నీవా' అన్నాడు.

"నేనేరా, ఏమిటిట్లా వూడిపడ్డానని ఆశ్చర్యపోతున్నావా?" కాదన్నట్లు తలూపాడు శివరాం వాడి ముఖంలో ఇంకా ప్రసన్నత రాలేదు ఆ కంగారు తగ్గలేదు. ఎట్లా తగ్గుతుంది? చేసిన ఘన కార్యానికి నా ముందు తలెత్తుకోవద్దూ వెధవ.

స్నానమదీ పూర్తిచేశాను. నా వెంటే వున్నాడు చిన్ననాటి ము చ్చ ట్ల న్నీ ఏకరువు పెడుతున్నాడు. నా కళ్ళు మాత్రం లలితకోసం వెదుకుతున్నై. బహుశ లోపలే వున్నదేమో, ఏదు చేసే పన్లకి బయటకు రావటానికి ముఖం చెల్లటం లేదేమో పాపం అల్లాలను కొన్నాను.

"భోజనానికి పద" తాళం చేతిలోకి తీసుకొంటూ అన్నాడు శివరాం.

"తాళ మెందుకురా ఇప్పుడు ?"

"హోటలు కూడే సీగ్గూడా."

మవునంగా వాణ్ణి అనుసరించాను. భోజనం చేస్తున్నంతసేపూ నా మనసొక తేనెతుట్టే అయింది లలిత పుట్టింటిగ్గాని వెళ్ళిందా ? అక్కడకు వెళ్ళటం సమం జసమే అయినా, నన్ను రమ్మని దేనికి వ్రాసినట్లు ? ఆమె పరోక్షంలో నేనే తప్పూ చేయలేదని పీడు ఋకాయిస్తే, లలితెప్పుడొస్తుందిరా అని వీణ్ణడిగితే, బాగుండకపోవటమటుంచి, నా రాక మీదే వీడికి సందేహాలేర్పడొచ్చు. ఏదో తింటమయిందనిపించి ఇంటిముఖం పట్టాం.

అర్ధరాత్రి గేటు బయట కారాగిన శబ్దం నవ్వులు, టాటాలు, గేటు తీసు కుని ఓ స్త్రీ ఆకారం మా మంచాల్ని సమీ పించింది నా గుండెల్లో సన్నని వణుకు. శివరాం తలదిండుక్రింది తాళంచెవులు తీసికొని వరండావైపు వెళ్ళిందామె పోతూ పోతూ ఓ క్షణం ఆగి నా మంచం వైపు ప్రశ్నార్థకంగా చూసింది, ఈ మనిషెవరా అన్నట్లు

ఆవిడ తలుపు తీసి లోపల కెళ్ళ గానే శివరాంను తట్టి పిల్చాను వాడు వులకలేదు, పలకలేదు సరిగదా కనీసం వాడిలో కదలిక గూడా లేదు. ఎంత బండనిద్ర వీడిది! నా దృష్టంతా లోపలే వుంది వీడి స్నేహితురాలేమో ! ఎం చారవ! ఎంత చనువు, ఇల్లాలు లే విషయం తెల్సికొని నేరుగా ఇంటికే రా పోకలు సాగిస్తున్నది ఆమెనని ప్రయో జనమేముంది ? ఆలోచనల్తో ఆ రాత్రి కంటిమీద కునుకే రాలేదు ఆ వచ్చి నావిడ ముఖాన్ని గుర్తించటానికి గూడా వీలులేనట్లుగా గుడ్డి వెన్నెల పైగా నిర్భయంగా తల పైకెత్తి చూడలేని నా పరిస్థితి

"నా భార్య లలిత" అంటూ ఉదయం శివరాం పరిచయంచేసిన వ్యక్తిని చూసిన నాకు నోట మాట రాలేదు. ఆశ్చర్యంతో విప్పారిన కళ్ళు కొన్ని క్షణాలట్లాగే వుండిపోయాయి ఈవిడా లలిత! శోకంతో మ్లానమై దీనాతిదీనంగా వుంటుందని వూహించిన ఆమె వదనం వేయి కాండిల్సు బల్బులా వెలిగిపోతు న్నది. తైల సంస్కారం లేక చిక్కువడి వుంటుందనుకొన్న జుట్టు స్థానంలో అతి నాజుకుగా వున్న బర్మాముడి ఏడుపుతో ఉబ్బిపోయిన కళ్ళుగాదు నే జూసింది కొసకంటా దిద్దిన కాటుకతో మిలమిలా మెరిసిపోతున్నై అవి మరి నన్ను రమ్మనమని వ్రాసిందెందుకో! నా రాక నాకే ప్రశ్నార్థకంగా వుండిపోయింది అనాడెప్పుడో పెండ్లినాడు చూసిన లలిత ఈమేనా అన్న సందేహంలోనే నేను తన్నుకులాడిపోయాను

ఆ తర్వాత రెండ్రోజులున్నాను.



లలిత దర్శనమే గగనమైపోయింది ఏ అర్ధరాత్రో అపరాత్రో ఆమె రావటం, తిరిగి ఉదయమే వెళ్ళిపోవటం, ఈ విషయాన్ని శివరాం అసలు పట్టించుకొన్నట్లే లేదు ఇదేదో అలవాటైన తంతే అన్నట్లుగా వుంది వాడి పోకడ ఆ వాతావరణం నాకు చెప్పరానంత ఇబ్బందిగా వుంది. నన్ను రమ్మనమని ఉత్తరంలో అంతగా ప్రాధేయపడ్డ లలిత, అసలా విషయమే నాతో ప్రస్తావించకపోవటమటుంచి, పట్టుమని పది నిముషాలైనా ఇంటిపట్టున వుండకపోవట మేమిటి? అంతుపట్టని ఈ చిత్రంతో నా తల తిరిగిపోయింది

శివరాంను పరిశీలనగా చూశాను వాడి కళ్ళలో కళాకాంతుల్లేవు ముఖమంతా పాలిపోయి, దైన్యం తాండవిస్తున్నది సగం చచ్చిన మనిషిలా బితుకు బితుకుమంటూ కన్పించాడు వాడు నా గుండెల్లో ఏదో వెలితి వేదన, అసలు

వీళ్ళిద్దరూ భార్యా భర్తలేనా? చల్లని కబుర్లు లేవు. అసలు పరామర్శలే లేవు ఆత్మీయత, అనురాగం అనే పదాలే వీళ్ళకి తెలియవేమో, ఒకింట్లో వుండే వింత శత్రువుల్లా అగుపించారు ఆ దంపతులిద్దరూ నాకు వీళ్ళిద్దరి మధ్యా ఏదో అగాధముంది అది ఆకాశమంత లేదా ఈ సృష్టంత.

మరో రెండ్రోజులుండి తిరుగు ప్రయాణమైనాన్నేను నా తో పా టే స్టేషన్ కొస్తున్న శివరాంను ఏదో అడగాలని, ఈ మిష్టరీ కొంత గాకపోతే కొంతైనా తెల్సుకోవాలని నా మనసు ఉబలాటపడింది

"శివరాం..."

"నీవడగ దల్చింది నాకు తెల్సురా"

"ఏమిటది??"

"స్టేషన్ దగ్గర చెప్తాలే పద."

స్టేషన్ కొచ్చాం. ప్లాట్‌ఫారం చివరగా నున్న బెంచీమీద నేనూ వాడూ కూర్చొన్నాం మా యిద్దరి మధ్యా అగాధ లోయలాటి నిశ్శబ్దం నేను సిగ్నల్ వైపు చూశాను.

"వస్తుందిలేరా బండి. ఆ రా ట పడకు."

"బండికోసం గాదు. ఏం తోచక చూసానంతే"

"లలిత వ్రాసిన లేఖ గూర్చే గదూ నీ ఆలోచన?"

తొట్రుపడి వాడివైపు చూశాను నా తడబాటును గమనించినట్లుగా జీవం లేని నవ్వు నవ్వాడు శివరాం మరు క్షణంలో వాడి ముఖం గంభీరమైపోయింది "ఆ ఉత్తరం వ్రాసింది లలిత కాదు"

"మరి?"

"నేనే"

"నువ్వా?" ఒక విచిత్రమైన అవస్థ నాది.

వాడు నిరామయంగా నావైపు చూశాడు ఆ కన్నుల్లో సన్నటి నీటి పొర అనునయంగా వాడి భుజంమీద చేయి వేశాను.

"దేనికి వ్రాశావట్లా?"

"కాస్త శాంతికి కోల్పోయిన మనస్సుకు కొంత పూరట"

"శివరాం!"

"అంతేగాదు. నేనూ ఒక మగవాణ్ణేనని చాటించుకోవాలనే ఉబలాటం గూడా మిత్రులందరికీ అట్లా లేఖలు వ్రాయించింది"


విషాదంగా వాడివైపు చూశాను

"లలితకు క్లబ్బులూ, మిత్రులూ తప్ప, నేనూ ఇల్లూ పట్టం ఏదో మొక్కుబడిగా తప్ప, ఆపేక్షగా నా చెంతకే రాదు"

"వారించకపోయావా?"

తల అడ్డంగా వూపి నిర్వేదంగా నవ్వాడు శివరాం

"అలివిగాని ఆలిని కట్టుకొని మురిగి




చచ్చేరా ముండాకొడుకని ఒక సామెత వుంది చూశావ్; అది నాలాటివాణ్ణి చూసి వ్రాసిందే"

"మార్చుకోటానికైనా ప్రయత్నం చేయకపోయావా?"

"నేను తెలిసికొనేటప్పటికే చేతులు కాలిపోయినై. అవమానం భరించలేక ఒకనాడు మక్కెలిరగతన్నాను."

"ఏమైంది తర్వాత?"

"నన్నునోటి కొచ్చినట్లు తిట్టింది బజారున పడింది. అసలు నన్ను చేసికొని ఆవిడ తన జీవితాన్నే త్యాగం జేసిందట"

"ఏ విషయంలో?"

"నావంటి కూపస్థ మండూకాన్ని భర్తగా స్వీకరించినందుకు"

ఆ క్షణంలోపోయి లలితను చంపేద్దామన్నంత ఆవేశమొచ్చింది నాకు మగవాడు దేన్నైనా భరించి నిద్రొక్కుకోగలడు గాని, భార్య బరితెగిస్తే మాత్రం అది నరకమే. నా శివరాం గుండెల్లో గూడా ఈ అగ్నిపర్వతముందా?

"మొదట్లో బ్రతుకు దుర్భరం అనుకొన్నాను నన్ను నేను చంపుకొని రాజీ కుదుర్చుకొన్నాను. వెకిలి నవ్వుల్ని, వేలుపెట్టి చూపటాల్ని గరళంలా దిగమింగుకొని ఏదోవిధంగా జీవించటం అలవాటుచేసుకొన్నాను."

శివరాం గుండెల్లో కోత, కన్నుల్లో వూట, నరాల్లో నిప్పు, మనసులో సమరం. జాలిగా వాణ్ణి చూస్తూ వుండిపోయాను.

"ఆమెగారి ప్రతాపం శృతిమించింది. ప్రచారం పరిధులు దాటింది. పదిమంది

కళ్ళు నా మీదే. "నీలో పౌరుషం, రోషం చచ్చాయా? నీవూ మగవాడి వేనా?" అని ప్రశ్నించినట్లుండే చూపులు......" చెప్తూ తల వొంచు కున్నాడు శివరాం. మాట్లాడుతున్న పుడు వాడి గొంతుకు అడ్డంగా ఏదో వుండ నా మనసు విలవిల లాడింది రెండు నిమిషాలు గడిచిపోయాయి

"నీవూ నన్నసహ్యించుకొంటున్నావ్ గదూ?" ప్రశ్నించాడు శివరాం.

"లేదురా, మనసారా అభినంది స్తున్నాను."

"దేనికి?"

"ఇంత విషంలోనూ అమృతంలా వున్నందుకు"

జాలిగా నవ్వాడు శివరాం. ఆ నవ్వు నిండా నిరాశలు, నిట్టూర్పులూను

"శివరాం..."

"అడగరా"

"ఆ ఉత్తరం దేనికి వ్రాశావ్?"

"నా భార్య గుర్తించకపోయినా కనీసం మీరైనా నేనూ మగవాణ్ణే నన్న భావాన్ని బలపర్చుకొంటారని ఆ ఆశ తోనే మిత్రులందరికీ ఇట్లా లేఖలు వ్రాశాను."

"మరి మిత్రులందరూ నిన్నపార్థం చేసికొంటే, నిజంగా నువ్వు చెడిపోయా వని తలపోస్తే"

"నాక్కావాల్సిందీ అదే. ఈ నరకం కంటే అదే తృప్తి నాకు"

"నాలాగే నీ మిత్రులందరూ ఇక్కడ కొస్తే?"

"అంతదూరంనుండీ రారనే నే నను కొంది. వచ్చింది నీ వొక్కడివే"

కులాలను కన్న మతంలా, మతాల మధ్య బీభత్సంలా నిప్పులు కక్కుతూ వచ్చింది రైలు. బండి కదిలేంతసేపూ కిటికీ ప్రక్కనే నిలబడి నాతో మాట్లాడు తూనే వున్నాడు శివరాం. చెవులు చిల్లులు పడేంత శబ్దం చేస్తూ ఆవిరి కక్కి ముందుకు సాగింది ఇంజన్. పుట్టెడు జబ్బులో పడి, ఇహ ఎన్నడూ కోలుకోలే నట్లు బలహీనంగా వెనుదిరిగిపోతున్న నా శివరాం గుండెల్లోని ఆవిరిని గూడా, ఇట్లా ఇంజన్‌లా తోడివేయ గలిగే శక్తే నా కుంటే..., నన్ను నేనే తిట్టుకొంటూ ఒక నిట్టూర్పు విడిచాను

